క్లుప్తంగా

పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న టాటా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ అశోక్

ఓజిలి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే మణెమ్మ పేర్కొన్నారు. మండలంలోని మానమాల ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంను సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. మెనూ ప్రకారం పోషకాలతో కూడిన భోజనం అందించాలని, కేంద్రాలకు పిల్లల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ అశోక్, కార్యకర్తలు అపర్ణ, కామేశ్వరి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



సేవలు అందిస్తున్న వైద్యులు

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని మన్నూరు గ్రామంలో సోమవారం నారాయణ ఆరోగ్యమస్తు పథకం ద్వారా మండల వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాటూరు ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్యసేవలో సుమారు 150 మందికి ఉచితంగా వైద్యసేవలు అందించి మందులను పంపిణీ చేశారు.

క్రీడా సామగ్రి అందజేత



ఎస్‌ఐ అందించిన క్రీడా సామగ్రితో విద్యార్థులు

చిల్లకూరు: మండలంలోని పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎస్‌ఐ సురేష్‌బాబు తన సొంత నిధులతో క్రీడా సామగ్రిని అందించారు. పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుల ద్వారా క్రీడా సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం అనసూయ మాట్లాడుతూ గతంలో ఎస్‌ఐ సురేష్‌బాబు తల్లిదండ్రుల సమావేశానికి విచ్చేసిన సందర్భంగా క్రీడా సామగ్రిని అందిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అందులో భాగంగానే సుమారు రూ.25 వేల విలువ చేసే క్రీడా సామగ్రిని అందించారని అన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు బ్యాగుల పంపిణీ



బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని రాణిపేటలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ముత్తూట్ మిని ఫైనాన్షియర్స్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలు, బ్యాగులు, తల్లిదండ్రులకు గొడుగులను పంపిణీ చేశారు. ఆ సంస్థ స్టేట్ హెడ్ కన్నబాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

అండర్‌పాస్ వద్ద నీటితో ఇక్కట్లు



పెదపరియ అండర్‌పాస్ వద్ద నీటిలో వెళ్తున్న వ్యాన్

ఓజిలి: మండలంలోని పెదపరియ, దేవునికండ్రిగ గ్రామాల సమీపంలో రైల్వే అధికారులు ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు రైల్వే అండర్ పాస్‌లను ఏర్పాటు చేశారు. ఈ అండర్‌పాస్‌ల వద్ద వర్షపునీరు చేరి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు అధికంగా నిలిచి అండర్‌పాస్‌లలో నిలిచి మినీవ్యాన్, ఆటో, ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. రైల్వే అధికారులు నీటిని తొలగించే చర్యలు చేపట్టకపోవడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. వర్షకాలం వస్తున్న తరుణంలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు		07-10-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	135
లేయర్ లైవ్	:	122
బ్రాయిలర్ చికెన్	:	242
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	266
లేయర్ చికెన్	:	207

దయనీయం... వృత్తి జీవనం

- ఆదరణ కోల్పోయిన చేతివృత్తి దారులు
- శ్రమకు తగిన ఫలితం దక్కని వైనం



డీవీ సత్రంలోని బార్బర్ షాపులో కత్తెరకు సాన పడుతున్న వృత్తిదారుడు



కొత్తపల్లిలో బుట్టలు అల్లుతున్న మేదరులు

దొరవారిసత్రం: ఈ పోటీ ప్రపంచంలో ప్రతీది రెడీమేడ్‌గా ప్లాస్టిక్, మెటల్ తదితర సామాన్లు మార్కెట్‌లోకి రావడంతో వివిధ రకాల చేతి వృత్తిదారులు ఆదరణ కోల్పోయారు. మండలం పరిధిలో బూదూరు, ఆనేపూడి, కొత్తపల్లి, ఏకొల్లు గ్రామాల్లో సుమారు 25 ఏళ్ల కిందటి వరకు 50కుటుంబాలు(ఎస్టీ)ఉన్నాయి. కుమ్మరి, వడ్రంగి, కంసాలి, ఈత మండలతో బుట్టలు అల్లేవారు, కత్తులు, కత్తెరలు సానపట్టి జీవనం సాగించే వివిధ రకాల చేతి వృత్తిదారులు నేడు గ్రామాల్లో కనుమరుగైపోయారు. దీంతో చేతి వృత్తిదారుల ఏ పనులు చెయ్యలేక వారి కుటుంబ జీవనం కష్టంగా మారింది. వీరిలో ముఖ్యంగా ఎస్టీ(ఎరుకుల)లు ఈత మండలతో బుట్టలు అల్లుకునే వారు, గ్రామాల్లో సంచరిస్తూ కత్తులు, కత్తెరలు, చాకులు సానా పట్టి (ముస్లీం) వారు, కుండలు, కమ్మరి పని చేసేవారు గ్రామాల్లో సంచరిస్తూ వ్యాపారం చేసుకునే వారి జీవనం దారుణంగా మారింది. చేతి వృత్తిదారులకు పనులు ఎక్కడ లేకుండా పోవడంతో గ్రామాల్లో ఎక్కడ చేతివృత్తిదారులు కనిపించడం లేదు. అరకొరగా కొన్ని గ్రామాల్లో వృత్తినే నమ్ముకుని ఏ పని చెయ్యలేక నానాఇబ్బందులు పడుతున్నారు. శ్రమకు తగిన ఫలితం రాక కుటుంబాల పోషణకు అతి కష్టం మీద జీవనం వెల్లబుచ్చుతున్నారు.

అదేవిధంగా మేలనాలత్తూరు, నెలబల్లి, అక్కరపాక, ఏకొల్లు గ్రామాల్లో కుమ్మరి, కమ్మరి కుటుంబాలు 50 పైబడి ఉన్నాయి. ఈప్రాంతాల్లో కుండలు, కత్తులు, వ్యవసాయ పని ముట్లు తదితరవి తయారు చేసి బయట ప్రాంతాల్లో అమ్మి జీవించారు. ఈవృత్తి దారులకు రానురాను ఆదరణ పూర్తిగా తగ్గిపోడంతో కుమ్మరి, కమ్మరి పనులు చేసేవారి స్థానికంగా పనులు లేకపోడంతో వీరందరూ సుమారు 20 ఏళ్ల కిందటే వృత్తిని మానేసి పట్టణ ప్రాంతాల్లో రకరకాల పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గొల్లపాళెం గ్రామానికి చెందిన 11 ముస్లిం కుటుంబాలు కేవలం కత్తులు, చాకులు తదితర వస్తువులకు సాన పట్టి ఏకష్టం లేకుండా జీవించారు. వీరి పరిస్థితి కూడా దారుణంగా మారడంతో నేడు నాలుగు కుటుంబాలే కత్తులకు సానా పడుతూ అతి కష్టం మీద జీవిస్తున్నారు.

కష్టానికి తగిన ఫలితం లేదు



గ్రామాల్లో తిరిగినా సాన పట్టించుకునేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. రోజంతా కష్టపడితే రెండు వందలు కూడా రాదు. కేరళలో మాకు మంచి డిమాండ్ ఉంది. అందువలన అక్కడికే వెళ్లి అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి కుటుంబాల బాగోగులు చూసుకుంటాము.

– షేక్ రహింతుల్లా, గొల్లపాళెం గ్రామం

ఎంతో కష్టబడి బుట్టలు అల్లుతాం



అటవీ ప్రాంతానికి వెళ్లి ఈత మండలు కొట్టి వాటిని ఎండబెట్టి ఎంతో కష్టంగా బుట్టలు అల్లుతాము. అయితే కొనేవారు లేకుండాపోతున్నారు. గ్రామాల వెంబడి తిరిగి నష్టానికి అమ్ముతున్నాం. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. కష్టానికి తగిన రాబడి ఉండడంలేదు.

– పోలయ్య, కొత్తపల్లి ఎస్టీ కాలనీ

రెడీమేడ్‌కే ఆదరణ ఎక్కువ



అందరూ రెడీమేడ్ వైపు మొగ్గు చూపడంతో మాకు పనులు లేకుండాపోయాయి. గతంలో చేతి నిండా పని ఉండేది ఏకష్టం లేకుండా కుటుంబాన్ని పోషించాం. ఈ ప్రపంచంతో పోటీ పడి జీవించలేకపోతున్నాము. దీంతో చేతిలో నైపుణ్యంతో కూడిన పని ఉండి కూడా పని దొరకడంలేదు.

– ఎం ధనశేఖర్, కమ్మరి, నేలపట్టు గ్రామం

జంట నాగుల విగ్రహ పత్రిష్ట

రాపూరు: మండల కేంద్రంలోని వరసిద్ధి వినాయక దేవాలయంలో 7, 8 తేదీల్లో నవగ్రహ, జంట నాగుల విగ్రహాల పత్రిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సూరావఝ్ఝల నాగరాజ స్వామి తెలిపారు. 7వ తేదీ సాయంత్రం గణపతి పూజ, అంకురార్పణ కార్యక్రమం, 8వ తేదీ ఉదయం గణపతిపూజ, నవగ్రహ మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసం, క్షీరాధివాసం, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, శాంతికల్యాణం, అన్నదానం ఉంటుందని వివరించారు.

జీఎస్టీ సేవింగ్స్‌పై ర్యాలీ

కలువాయి(సైదాపురం) : మండల కేంద్రంలో ఎంపీడీవో ఏ శైలజ ఆధ్వర్యంలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై జడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చల్లా కళారాణి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌డి అబ్బాస్ అలీ, ఎస్‌సీసీ అధికారియన్ పెంచలపుల్లయ్య పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

రాపూరు: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం రాపూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భవాని ఓక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు, జెడ్పీటీసీ, మండల అధికారులు విధిగా పాల్గొనాలని కోరారు.

గ్రీవెన్స్ వినతులను పరిష్కరించాలి

ఓజిలి: గ్రీవెన్స్ సెల్‌లో ప్రజలు అందించిన వినతులను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ పద్మావతి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో వినతులు స్వీకరించారు. గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా వీఆర్వోలు చర్యలు చేపట్టాలన్నారు. గ్రీవెన్స్‌లో ప్రజల వినతులను పరిష్కరించి న్యాయం చేయాలని తెలిపారు.

ఆగిన 104 వైద్య సేవలు



పీహెచ్‌సీలో నిలిచిపోయిన 104 వాహనం

చిల్లకూరు: రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు సమ్మె బాట పట్టిన నేపథ్యంలో పల్లెలకు వచ్చి సేవలందించే 104 వాహనాలు కదల్లేదు. దీంతో సోమవారం మండలంలో వైద్య సేవలు అందించే 104 వాహనం పీహెచ్‌సీకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టక ముందు వైద్యులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చినప్పటికీ అధికారం చేపట్టిన తరువాత పట్టించుకోకుండా పోవడంతో వైద్యులు సమ్మెబాట పట్టారు. ఈ క్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్న విద్యార్థులతో పాటుగా అక్కడక్కడ సీహెచ్‌సీలలో పని చేసే వైద్యులను తాత్కాలికంగా సర్దుబాటు చేశారు. అయితే అధిక శాతం వైద్యులు, పీజీ విద్యార్థులు దూరంగా ఉండే ఆస్పత్రులకు వెళ్లకపోవడంతో పలు ప్రాంతాల్లో అత్యవసర సేవలు అందుబాటులోకి రాకుండా పోతున్నాయి. ఈ క్రమంలోనే పల్లెల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించడంతోపాటుగా నెల వారీగా ఇచ్చే మందులు ఆగిపోవడంతో వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



పచ్చి రొట్ట విత్తనాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

చిల్లకూరు : కూటమి ప్రభుత్వంలో వ్యవసాయశాఖ ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పూర్తి స్థాయిలో అందక పోవడంతో రైతులు రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని అదానీ ఫౌండేషన్, అదానీ కృష్ణ పట్నం పోర్టు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ విభాగం ప్రతినిధులను కోరారు. ఈ క్రమంలో కంపెనీ ప్రతినిధులు సోమవారం మండల తీర ప్రాంతంలోని ఏరూరు గ్రామంలో పచ్చి రొట్ట విత్తనాలను గ్రామ సర్పంచ్ ఆడేపూడి కామాక్షి చేతుల మీదుగా రైతులకు అందించారు. కేఎఫ్‌పీసీఎల్ సీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు భూమి సారవంతం చేసే పచ్చిరొట్ట విత్తనాలకు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ క్రమంలో రైతులకు తమ సంస్థ ద్వారా విత్తనాలు అందిస్తున్నట్లు వివరించారు.

అమృత్ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఆరి శంకరయ్య

వెంకటగిరి(సైదాపురం): పట్టణ ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హయాంలో మంజూరైన అమృత్ 2.0 పథకం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపాలిటీ జనాభాను దృష్టిలో పెట్టుకుని గత 20 ఏళ్ల క్రితం నేదురుమల్లి రాజ్యలక్ష్మి మంత్రిగా ఉన్న సమయంలో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటి వరకు ట్యాంకు ద్వారా పట్టణ ప్రజలకు తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. అయితే కొన్ని చోట్లు పైప్‌లైన్‌లు లీకేజీ అవుతుండడంతో తాగునీరు సరఫరా కావడం లేదని తెలిపారు. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోని అమృత్ 2.0 పనులు సకాలంలో పూర్తిచేసి పట్టణ ప్రజలకు తాగునీరు అందించాలని ఆయన కోరారు.

ఎస్‌ఈసీ సభ్యులకు సన్మానం

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్‌ఈసీ(స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) సభ్యులుగా ఎంపికైన రాపూరు మండల వైఎస్సార్‌సీపీ సీనియర్‌నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, కొడవలూరు భక్తవత్సలరెడ్డి, వేమారెడ్డి కుమార్‌స్వామిరెడ్డి సోమవారం నెల్లూరులోని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో ఆయన్ను కలిశారు. ఆ ముగ్గురిని నేదురుమల్లి సత్కరించి పలు సూచనలు చేశారు. పాపకన్ను మధుసూదన్ రెడ్డి, గూడూరుకు చెందిన ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోట మండలం అల్లంపాడుకు చెందిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని నెల్లూరులోని తన నివాసంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సన్మానించారు. వారు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీలో కష్టపడిన వారికి పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు.

– రాపూరు/వాకాడు/సైదాపురం/చిల్లకూరు





పాపకన్ను మధుసూధన్‌రెడ్డిని, భక్తవత్సలరెడ్డిని అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



కుమార్‌స్వామిరెడ్డిని శాలువతో సత్కరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి



పాపకన్ను మధుసూధన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్





పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని, ఎల్లసిరి గోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్

వీవోఏలతో సమీక్షా సమావేశం

కలువాయి(సైదాపురం): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వెలుగు ఏపీఎం రవి, శ్రీనిధి ఏజీఎం కామక్షయ్య ఆధ్వర్యంలో వీఓఏలతో సోమ వారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా శ్రీనిధి రికవరీ, మొబైల్ బుక్ కాపింగ్, లోకాస్ యాప్‌లపై సమీక్షించినట్లు ఏపీఎం రవి తెలిపారు. వీవోఏలకు బయోమెట్రిక్ మిషన్లను అందజేశారు. పశువులకు, గొర్రెలకు బీమా కలిగి ఉండాలని వెటర్నరీ డాక్టర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు, వెటర్నటీ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ క్రీడా ఎంపికలు

కలువాయి(సైదాపురం): మండల స్థాయి ఎస్‌జీహెచ్ (స్కూల్ గేమ్ ఫెడరేషన్) క్రీడా ఎంపికలు 8న బీవీఎస్‌ఆర్ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ పద్మభూషణ్, ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్ ఆలీ తెలిపారు. ముఖ్యంగా అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ మీద పోటీలు జరుగుతాయని అన్నారు. వివరాలకు రాజా 99492 65047ను సంప్రదించాలని కోరారు.

వైద్యశాల అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారం

నాయుడుపేటటౌన్: స్థానిక సామాజిక వైద్యశాల అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, కమిటీ సభ్యులుగా గొల్ల వెంకటరమణయ్య, సగుటూరు ముత్యాల వినయ్‌కుమార్, నాసిన సంపూర్ణమ్మతో పాటు వైద్యశాల సూపరింటెండెంట్ అమరనాథ్, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఎంపీడీఓ కోటూరు సురేష్‌బాబు నియమితులయ్యారు. వీరి ప్రమాణ స్వీకారాన్ని వేడుకగా నిర్వహించారు.

చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ

గూడూరురూరల్ : గూడూరు పట్టణంలోని మిట్టపాళెం, ఇందిరమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. సీడీపీఓ మెహబూబి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పోషకాహారంతో రక్తహీనత లేకుండా గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

ప్రభుత్వ భూములు నిరుపేదలకు ఇవ్వాలి

గూడూరురూరల్ : భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వ భూములను ఇవ్వాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం బాలాయపల్లి మండలం గొట్టికాడు గ్రామస్తులతో కలసి నిరసన తెలిపారు. జోగి శివకుమార్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 50 మంది వ్యవసాయ కార్మికులు కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి ఎలాంటి జీవనాధారం లేదని, వారికి ఆ భూములను మంజూరు చేయాలని పేర్కొన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకి వినతిపత్రం అందజేశారు.

కండలేరులో 58.690 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 58.690 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3600 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 430, పిన్నేరుకాలువకు 140, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటిబ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

యూరియా కొరతపై స్పందించరే?



మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: మండలంలోని పెళ్లకూరు, చెంబేడు, నెలబల్లి వ్యవసాయశాఖ గోదాముల్లో ఒక్క యూరియా బస్తా కూడా రైతులకు అందుబాటులో లేకపోవడంపై కూటమి పాలకులు ఎందుకు స్పందించలేదని అధికారులను మండల పరిషత్ అధ్యక్షుడు పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 24 పంచాయతీల్లో ప్రతి ఏటా రబీ సీజన్‌లో సుమారు 4,750 హెక్టార్ల మేరకు వరి సాగు చేయడం వల్ల సుమారు ఐదు వేల కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడుతున్నట్లు వివరించారు. అయితే పెళ్లకూరుకు మాత్రం ఒక్క బస్తా కూడా అందుబాటులో లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పాలకులు స్పందించి యూరియా అందుబాటులో ఉంచాలని కోరారు. తెలుగుగంగ జలాలను చెరువులకు సరఫరా చేసేలా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత కొంత కాలంగా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఉద్యానవనశాఖతోపాటు పలువురు మండలస్థాయి అధికారులు అందుబాటులో లేకపోవడమే కాకుండా సర్వసభ్య సమావేశాలకు దూరంగా ఉండడంపై మండిపడ్డారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, పీఏసీఎస్ అధ్యక్షుడు కేవి నాయుడు, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంటనే మరమ్మతులు చేపట్టాలి



రొయ్యలవాగు పొర్లుకట్టను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామ సమీపంలో ఉన్న రొయ్యలు వాగు కల్వర్టుకు మరమ్మతులు చేయాలని వైఎస్సార్ సీపీ నేతలు చెన్నారెడ్డి బాబురెడ్డి, మాచిరెడ్డి సుధాకర్ రెడ్డి అధికారులను కోరారు. వారు సోమవారం స్థానిక రైతులతో కలసి రొయ్యల వాగు కల్వర్టును పరిశీలించారు. ఈ వాగు కల్వర్టు పక్కనే తాగునీటి పైపులైను ఉందని చెప్పారు. అయితే ఆ పైపులు పగిలిపోయి తాగు నీరు లీకవడంతో అధికారులు మరమ్మతుల కోసం పక్కనే ఉన్న రొయ్యల వాగు ఆనకట్టను తవ్వేశారన్నారు. దీంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రొయ్యలు వాగుకు పూర్తి స్థాయిలో నీరు వస్తే పొంగి ఈ పొర్లుకట్ట తెగిపోయి పంటపొలాలన్నీ మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ముందుగానే స్పందించి దీనికి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ మునిరత్నం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై హెచ్‌ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓ ఎం మునిరత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, జీఎస్టీ అధికారి సీ రమణయ్య పాల్గొని మండల పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు అవగాహన కల్పించారు.

నాగలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆలయం వద్ద నాగలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట చేపట్టిన వేదపండితులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని స్వర్ణముఖి నది తీరాన ఉన్న ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసి ఉన్న కార్తీక స్మృతి వనం వద్ద నాగలింగేశ్వరస్వామి, నాగరాజస్వామి, శివలింగాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయం వద్ద ప్రత్యే క పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠించే దేవతామూర్తులతో పట్టణంలోని ప్రధాన వీ ధుల్లో ఊరేగింపు నిర్వహించి ఆలయం వద్దకు చేర్చారు. దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠను వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గర్భిణులకు పండ్ల పంపిణీ



గర్భిణులకు పండ్లు అందజేస్తున్న మనోజ్‌కుమార్

గూడూరురూరల్ : గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సోమవారం గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. శ్రీసాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో అల్పాహారాన్ని అందించారు. భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర నాయకులు గిద్దలూరు మనోజ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర అధ్యక్షులు శివశంకర్, నాయకులు వసంత్, చైతన్య, యశ్వంత్, మణి, కిరణ్, నవీన్ పాల్గొన్నారు.

పశువైద్య సిబ్బందికి అవగాహన సదస్సు

కలువాయి(సైదాపురం): కలువాయి పశువైద్యశాలలో కలువాయి, చేజర్ల మండలాల పశువైద్య సిబ్బందికి సోమవారం ఏడీ గురుజయంతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎఫ్‌ఎండీ వ్యాక్సిన్, గోకులం షెడ్లు, పశుగ్రాసాల మీద సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు కృష్ణమోహన్, కృష్ణప్రసాద్, రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.